సీరియల్

అడుగు ముందుకు వేస్తే భస్మం

వసుంధర

(పన్నెండవ భాగము)

"హలో! మీరెవరో గాని మీకు సంబంధించని చోటుకు వస్తున్నారు. అడుగు ముందుకు వేస్తే చస్తారు! మర్యాదగా వెనక్కి వెళ్ళిపొండి" అన్నాడు.

టెలివిజన్లోని మనుష్యులు ఆగిపోయారు.

గురువుగారు మళ్ళీ ఉచ్చరించారు. ఈ పర్యాయం నెమ్మదిగా ఆ మనుష్యులు ముందడుగు వేయసాగారు.

గురువుగారు ఆ మనుష్యుల్ని శ్రద్ధగా పరిశీలిస్తున్నాడు. హఠాత్తుగా ఒక మనిషిని గమనిస్తున్నాడు. టెలివిజన్లోకి చూస్తూనే కంట్రోల్ ప్యానెల్లో ఓ మీటను నొక్కాడు. గురువుగారు మెచ్చుకున్న మనిషి ఠక్కున అరచి పడి

పోయాడు. మిగతా మనుషులు భయంగా ఆగిపోయారు.

"ఒక్కొక్కరే యిలా చస్తారా? లేక వెనక్కి పోతారా?"

గురువులు హెచ్చరిక వింటూ వాళ్ళు భయభ్రాంతులై ఆగిపోయారు. గురువులు శ్రద్ధగా టెలివిజన్ని గమనిస్తున్నాడు.

కాసేపు ఆగి వాళ్ళు మళ్ళీ ముందుకు కదిలారు. గురువులు యింకో మనిషిని హతం చేశాడు. అలా మొత్తం ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అప్పటికి పోలీసులు వెనక్కి తిరిగారు. కాసేపటికి టెలివిజన్లోని కాంతి మాయమయింది.

గురువులు మళ్ళీ కంట్రోల్ మిషన్ లోని రెండు మీటలు నొక్కి "బంగళాలోవున్న వారందరికీ హెచ్చరిక. కంట్రోల్ రూం మా వశమైంది. మే మెవ్వరో త్వరలో నే మీరు తెలుసుకుంటారు. ఈలోగా మీరు ఒకక్కొక్కరుగా బయల్దేరి కాలనీ నుంచి బయటకు వచ్చి మాకు లొంగిపోవలసిందిగా కోరుతున్నాము. అలా చేయని పక్షంలో కాలనీ అంతా పేల్చేయబడుతుంది. సరిగ్గా ఒక గంట మాత్రం గడువు" అన్నాడు.

"ఇదంతా చాలా విచిత్రంగా వుంది. ఈ కాలనీనిగానీ ఇక్కడి యేర్పాట్లనుగానీ నాశనం చేయాలని నేనను కోవడంలేదు. శాంతియుతంగా అందర్నీ లొంగదీసుకో గలిగితే మంచిది" అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

"ఈశ్వరి మీకు దారి చూపిస్తుంది. మీరు మీ మనుషుల్ని దూరంగా వుంచి కాలనీ నుంచి బయటకు వచ్చిన ఒకొక్కరినే బంధించండి" అన్నాడు గురువులు.

"అది చాలా కష్టమైన పని. ఎవరిదగ్గరైనా ఆయుధ

ముండవచ్చు. ఎక్కడైనా మోసం జరగవచ్చు...."
అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

గురువులు తన దగ్గరవున్న పుస్తకాన్ని శ్రద్ధగా మరో సారి చూచాడు. అలా చూస్తూండగా అతని కళ్ళు మెరిశాయి.

"నేను శ్రద్ధగా చూడలేను. నా హెచ్చరిక పూర్తి కాగానే కాలనీ అంతా ఒకరకమైన గ్యాస్‌తో నిండి పోతుంది. ప్రస్తుతం అక్కడున్న వారందరూ స్పృహలో వుండరు. వారికి స్పృహ రావడానికి కొన్ని గంటలు పట్టవచ్చు. ఈలోగా మీరు వెళ్ళి వాళ్ళను బంధించండి. కాలనీలో యెక్కడెక్కడ యెవరుంటారో యెంతమంది వుంటారో ఈ పుస్తకంలో వివరంగా వుంటాయి. తీసుకు వెళ్ళండి. ఎవరినీ వదలవద్దు" అన్నాడు గురువులు.

శ్రీకృష్ణపరమాత్మ ఈశ్వరనీ, తన మనుషుల్నీ వెంట బెట్టుకుని బయటకు వెళ్ళిపోయాడు. సంతోషం ఆయన ముఖంలో కొట్టవచ్చినట్లు కనబడుతోంది.

గురువులు అక్కడున్న యంత్రాలనూ, ఇతర వివరాలనూ శ్రద్ధగా గమనిస్తూ అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. తనపని సుకరమవుతుందనీ, కష్టాలన్నీ గట్టెక్కాయనీ అతనికి చాలా సంతోషంగా వుంది. ఇప్పుడు శ్రీకృష్ణపరమాత్మ తనకే విధంగా సహాయపడలదో చూడాలి. సమాజంలో తనూ అందరిలో సమంగా జీవించాలని వుబలాటపడుతున్నాడు. అందుకు శ్రీకృష్ణ పరమాత్మ సాయం కావాలి!

* * *

కంట్రోల్ రూంలో ఎవరో వస్తున్న అలికిడి విని గురువులు అటుతిరిగి మిషన్ మీద ఒక మీటపై చేయివేసి

సిద్ధంగా వున్నాడు. అయితే ముందుగా అతనికి కనిపించిన వ్యక్తి శ్రీకృష్ణపరమాత్మ. గురువులు మీటమీద చేయి తీసివేశాడు.

ఆ పక్కనున్న మనిషి ఎవరో అతనికర్థం కాలేదు. శ్రీకృష్ణపరమాత్మ అనుచరుడేమో అనుకున్నాడు కానీ ఇంటాకా చూసిన గుర్తులేదు.

"గురువులూ, కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్లయింది నా పని! ఇక్కడి వ్యవహారాలు నడిపిస్తున్న అంతర్జాతీయ గూఢచారి శాఖకు నాయకుడు యెవరో కాదు. నా స్నేహితుడు" అన్నాడు పరమాత్మ.

"అంటే?" అన్నాడు గురువులు.

"మా ఇద్దరి పరిచయం ఈనాటిది కాదు. వృత్తిరీత్యా ఇద్దరమూ ఒకటే కానీ డిపార్టుమెంట్సు వేరు. ఈ ప్రపంచంలోని ఎక్కడెక్కడి అపూర్వవస్తువులనూ, కళాఖండాలనూ గురించి, సేకరించి ఏ దేశంలో ఎక్కువ ధర పలికితే ఆ దేశంలో అమ్మివేసే ప్రపంచ సమస్థ ఒకటుంది. ఆ ప్రపంచ సంస్థ భారతీయ విభాగానికి నేను నాయకుణ్ని.

వృత్తిరీత్యా నేనూ యితడూ చాలాసార్లు ఒకరికొకరు తటస్థపడ్డాము. ఒకరికొకరు సాయం చేసుకుని ఇద్దరమూ ఇబ్బందుల నుంచి బయటపడ్డ సందర్భాలు చాలా వున్నాయి.

అయితే ఒకరిని గురించి ఒకరికి పూర్తి సమాచారాలు తెలియవు. నీ మూలంగా మాకు ఒకరిని గురించి ఒకరికి తెలిసింది. నీకు చాలా చాలా థాంక్స్. ఇంతకాలం విడి విడిగా రెండు సంస్థలుగా వుంటున్న మేము యీ రోజు నుంచీ చేతులు కలిపి ఒకటి కాదలిచాము" అన్నాడు

శ్రీకృష్ణపరమాత్మ.

"అంతేకాగు మిస్టర్ గురువులూ! నువ్వు మొరకలాంటి మనిషివి. నీలాంటివాడు మాకు కావాలి. నువ్వు మాకు అనుచరుడుగా వుండిపో. నీ జీవితం స్వర్గతుల్యంగా వుంటుంది" అన్నాడు బాస్.

గురువులు నిరుత్సాహంగా "ప్రమాదాలు, సాహస చర్యలమీద నాకిరక మోజులేదు. సాఫీగా జీవితం గడపాలని వుంది. వాగ్దానం చేసిన ప్రకారం నాకూ, ఈశ్వరికీ ప్రశాంత జీవితం ప్రసాదించు పరమాత్మా!" అన్నాడు.

"సహచరులను వదిలిపెట్టడం శ్రీకృష్ణపరమాత్మకు నచ్చదు. నువ్వు మాతోనే వుండాలి" అన్నాడు శ్రీకృష్ణ పరమాత్మ.

"ఒప్పుకోకపోతే!" అన్నాడు గురువులు.

"నీకు మళ్ళీ ప్రమాదాలెదురౌతాయి...." అన్నాడు బాస్.

"ముందు మీ సావరం నా చేతుల్లో వున్నదని గుర్తుంచుకోండి. క్షణంలో నాశనం చేయగలను" అంటూ నవ్వాడు గురువులు.

శ్రీకృష్ణ పరమాత్మ అతనికంటె గట్టిగా నవ్వి "నీ ప్రాణానికి ప్రాణమైన ఈశ్వరి మా చేతుల్లో వుంది బయట నా అనుచరుల చేతుల్లో!" అన్నాడు.

గురువులు నీళ్ళుకారిపోయాడు. బాస్ రెండు అంగల్లో గురువుల్ని సమీపించి "కంట్రోల్ మిషన్ దగ్గరున్నానని ఎంత గర్వం నీకు!" అన్నాడు.

"నాకు గర్వంలేదు. ఏ కోరికా లేదు. నన్ను వదిలి పెడితే చాలు" దీనంగా అన్నాడు గురువులు.

"అజ్ఞానంకొద్దీ వదిలిపెట్టమంటున్నావు కాని అసలైన

స్వర్గమేమిటో గుర్తించగానే నువ్వింక ఒక్క క్షణంకూడా మమ్మల్ని వదిలి పెట్టలేవు" అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

"నా అజ్ఞానంలో నేను బాధపడతాను. నా కిష్టమే!"

"కానీ నాకిష్టం లేదు" అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

"గురువులూ! ఇక్కడికి వచ్చి యిన్ని రహస్యాలు తెలుసుకుని బయటి ప్రపంచానికి వెళ్ళిన మనిషిని బ్రతకనివ్వడం నా ఆచారం కాదు. బ్రతకదల్చుకున్నవాడు నా దగ్గరే వుండాలి" అన్నాడు బాస్.

"నీ కోసం నేను పడ్డ శ్రమకు ప్రతిఫలం యిదా?" అన్నాడు గురువులు.

"నా అవసరంకొద్దీ నేను ఆశపెట్టాను. నీ అవసరంకొద్దీ నువ్వు ఆశపడ్డావు. నేను కలగ చేసుకోకపోతే నువ్వీపాటికి జైల్లో మగ్గిమగ్గి ఉరి తియ్యబడి వుండేవాడివి. నీకు ప్రాణదానం చేసినందుకు కృతజ్ఞతగా చేసిన సేవను శ్రమ అనుకోవడం కృతఘ్నుల లక్షణం" అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

గురువులుకు అంతులేని ఆవేశం వచ్చింది "మీరు చాలా దుర్మార్గులు" అంటూ అతను బాస్ మీదకు దూకాడు. పెనుగులాటలో ఇద్దరూ టెలివిజన్ మీద పడ్డారు. అది క్రిందపడింది. అది బద్దలుకావడం చూస్తూనే బాస్ ముఖం ఎర్రబడింది.

"అయిదు నిముషాల్లో మనం అంతా బయటకు వెళ్ళకపోతే నీ ఈశ్వరిగతి అక్కడ కుక్కలగతి అవుతుంది. ఆ విషయం గుర్తుంచుకుని మాతో బయటకు రా" అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ తీవ్రంగా.

బాస్ లేచి నిలబడి "ఊఁ పద!" అన్నాడు.

గురువులు విసురుగానే అక్కణ్ణుంచి కదిలాడు.

ముగ్గురూ అక్కణ్ణుంచి బయటకు వచ్చారు. అక్కడి దృశ్యం చూసి గురువులు నివ్వెరపోయాడు.

ఈశ్వరి అక్కడ నిలబడి వుంది. ఆమె చుట్టూ నలుగురు పురుషులు అసభ్యకరంగా ఆమెను తాకుతూ గేలి చేస్తున్నారు.

"ఆగండి!" అని అరిచాడు గురువులు.

"అనవసరంగా ఉద్రేకపడకు గురువులూ! ఇక్కడ నీ మీదకు గురిపెట్టబడ్డ తుపాకులు చాలా వున్నాయి. అటు ఈశ్వరి, ఇటు నువ్వు ప్రాణాలు కాపాడుకోవడానికి కొన్ని పనులు చేయాల్సివుంది. అలాంటి అవసరం వుంటుందని యిప్పుడే నాకు స్ఫురించింది" అన్నాడు బాస్.

"ఏమిటది?" అన్నాడు గురువులు.

"నాకిష్టంలేని పని చేసిన వాళ్ళచేత నాకిష్టమైన ఆట లాడించడం నాకు సరదా. మొత్తం మూడు రౌండ్సు" అన్నాడు బాస్.

గురువులుకు రామేశం చెప్పిన కథ గుర్తొచ్చింది. తను మళ్ళీ అనుకోని యిబ్బందిలో పడుతున్నాడా? బాస్ చెప్పబోయే ఈ ఆటలో పాల్గొని తను ప్రాణాలతో బయటపడతాడా?

బాస్ జేబులోంచి ఒక బ్లేడుతీసి గురువులు చేతికి ఇచ్చాడు "ఈ బ్లేడుతో నీ ప్రియురాలి కుడిచేతి అయిదు వేళ్ళమీద సన్నగా రక్తం చిమ్మేలా గాయం చేయాలి" అన్నాడు.

గురువులు రక్తం మరిగింది. చుట్టూ చూశాడు. అటు ఈశ్వరి పరిస్థితిగానీ, ఇటు తన పరిస్థితిగానీ ఏమీ బాగా లేదు. బాస్ ఆజ్ఞ పాటించక తప్పదు. అతను ఈశ్వరిని

సమీపించాడు. ఈశ్వరి తన కుడిచేతిని ముందుకు చాపి "గత్యంతరం లేదు, సందేహించకు!" అంది.

గురువులు భయంతో బాధతో కళ్ళు మూసుకున్నాడు. అతను ఎన్నో హత్యలు చేసి వుండవచ్చు. కానీ ఎన్నడూ యిలా అమానుష కృత్యం చేస్తున్నట్లు భావించలేదు. ఈశ్వరి చేతిని గాయపరచాలంటే అతనికి తన ప్రాణాలెవరో తోడేస్తున్నట్లుగా వుంది. అయినా తప్పలేదు. "బహుశా ఇది నేను చేసిన పాపాలకు శిక్ష అనుకుంటాను. శత్రువును కత్తితో పొడిచిన చేయి ప్రియురాలి మృదుహస్తాలను గాయపర్చబోతోంది" అంటూ అతను ఆమె చేతి వ్రేళ్ళపైన సన్నగా గీశాడు. మృదువైన ఆమె చేతివేళ్ళపై రక్తం చిమ్ముతోంది. గురువులు బాధగా కళ్ళు మూసుకున్నాడు.

బాస్ జేబులోంచి ఒక నిమ్మకాయ తీసి—"గురువులూ—దీన్ని రెండు చెక్కలు చేసి నీ ప్రియురాలికియ్యి. ఆమె తన కుడిచేత్తో స్వయంగా నా నోట నిమ్మరసం పిండితే తాగాలని మనసు పడుతున్నాను. రక్తధారలతో కలిసిన నిమ్మరసం నాకు చాలా యిష్టం...." అన్నాడు.

తర్వాత బాస్ ఒక మనిషిని పిలిచి—"ఆమె నా నోట్లో రసం పిండుతున్నంతసేపూ బాధగా మూలిగినప్పుడల్లా ఆమె వీపు మీద కొరడా ప్రయోగించు...." అన్నాడు.

అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి—నిమ్మచెక్కలతో ఈశ్వరి తనను సమీపించినపుడు బాస్ ఈశ్వరిని చూసి "నిన్ను అనుభవించి ఆనందించాలనుకున్నాను. కానీ నువ్వు నామీద పెద్ద దెబ్బ తీశావు. నువ్వు నాకు చేసినదానికి

ప్రతిగా నేను చేస్తున్నది చాలా స్వల్పం. నిమ్మరసంలో గింజలుంటే నాకు నచ్చవు. గింజల్ని ముందుగానే తీసేయ్. ఎడంచేయి ఉపయోగించకు...." అన్నాడు.

ఆ బాధ అంతా పంటి బిగువున భరిస్తూ ఈశ్వరి అతడి నోట్లో నిమ్మరసాన్ని పిండింది.

ఆమె బాధనూ, ఆవసనూ చూస్తూ శ్రీకృష్ణపరమాత్మ బాస్ లేస్తును అభినందించాడు. గురువులుకు వళ్ళు మండి పోయింది. నిస్సహాయంగా చూస్తూ నిలబడ్డాడు.

"ఇది ఫస్టు రౌండ్!" అన్నాడు బాస్—"ఇందులో ప్రియుని కారణంగా ప్రియురాలు గాయపడింది. రెండో రౌండ్లో ప్రియురాలి కారణంగా ప్రియుడు గాయ పడ తాడు—"

ఈశ్వరి భయం భయంగా బాస్ వంక చూసింది. ఆమె లోని స్త్రీ హృదయం ప్రియుని గురించి తానెన్ని బాధల నైనా సహించడానికి సిద్ధంగా వుంది. కానీ తన కార ణంగా ప్రియుడికి బాధ కలగకూడదని కోరుకుంటోంది.

"ఈశ్వరి నేలమైన పడుకుంటుంది. ఆమెకు పదికొరడా దెబ్బలు శిక్ష. ఆ దెబ్బలు తగులుతున్నంతసేపూ ఆమె కదల కూడదు. కదిలితే శిక్ష పెరుగుతుంది. గురువులామెను రక్షించవచ్చు. కానీ ఆమెను అతను చేత్తో కదపకూడదు. కొరడాను చేత్తో తాకకూడదు. దెబ్బలకు అడ్డునిలిచి మాత్రమే రక్షించాలి. ఈ రూల్సు పాటించకపోతే ఇద్ద రికీ కఠినశిక్ష వుంటుంది."

బాస్ మాటలు వింటూ గురువులు ఊపిరి బిగబట్టాడు. అక్కడ ఈశ్వరి లేనిపక్షంలో తానేదైనా సాహసానికి ఒడిగట్టి వుండేవాడు. కాని ఇప్పుడు పూర్తిగా నిస్సహా యుడైపోయాడు.

ఆ రౌండ్ కూడా పూర్తయిపోయింది.

గురువులు శారీరకంగా బాధపడినప్పటికీ తనకారణంగా ఈశ్వరి వంటిమీద ఒక్క దెబ్బకూడా పడలేదని ఆనందించాడు.

"ఇప్పుడు థర్డ్ రౌండ్!" అన్నాడు బాస్.

గురువులు, ఈశ్వరి ఊపిరి బిగబట్టారు. ఈ కిరాతకుడిప్పుడెలాంటి సరదా తీర్చుకోబోతున్నాడోనని ఇద్దరికీ భయంగా వుంది.

"లైలామజ్నూలను మించిన ప్రేమికులీ ప్రేయసీ ప్రియులు. అటువంటి ఘట్టాన్ని వారభినయిస్తారు. ఇద్దరికీ రెండు చీటీలు యిస్తాను. ఒకదాంట్లో "చంపు" అని ఉంటుంది. రెండోదాంట్లో "చావు" అని వుంటుంది. ఆ ప్రకారం యిద్దరిలో ఒకరు రెండవవారిని చంపాలి. చావవలసిన వారు చంపేవారిని గాఢంగా కౌగలించుకుంటారు. చంపేవారు రెండుచేతుల్తో కత్తిని బలంగా చావలవసినవార వీపులో దింపాలి."

శ్రీకృష్ణపరమాత్మ సంతోషంతో చప్పట్లు చరుస్తూ "నీకు నా జోహార్లు. ఇటువంటి ప్రదర్శనలిచ్చే వినోదం ముందు ఈ ప్రపంచంలో మరేదీ సాటిరాదు" అన్నాడు.

వణుకుతున్న చేతుల్తో తన చీటీ తీసుకున్నాడు గురువులు. "చావు" అని వ్రాసివుంది. "నాకు చావాలని లేదు!" అంటూ అరిచాడు గురువులు.

అదే సమయంలో "నాకు చంపాలని లేదు!" అంటూ అరిచింది ఈశ్వరి.

"అందుకే ఈ ప్రదర్శన నాకు వినోదభరితం" అన్నాడు బాస్.

గురువులు చూస్తూండగానే ఈశ్వరిచేతికి కత్తి

అందింది.

ఇన్నాళ్ళ తన జీవితం ఈ విధంగా అంతం కావలసిందేనా? అతను చుట్టూ చూశాడు. తనచుట్టూ తుపాకులు ధరించిన మనుషులు.

"నీ ముఖకవళికలు అద్భుతం. ఈ ప్రదర్శనలో సగం థ్రిల్లు ముఖకవళికలు చూసి ఆనందించడంలోనే వుంది" అంటూ వికటంగా నవ్వుతున్నాడు బాస్.

ఈశ్వరి గురువుల్ని సమీపించింది. గురువులు చుట్టూ చూస్తున్నాడు. తనూ ఈశ్వరీ కలిసి తప్పించుకునే అవకాశం ఎక్కడా కనబడ్డంలేదు. తను తప్పించుకోగలిగితే ఈశ్వరి తనకు దక్కదు. అలాంటప్పుడు బ్రతికిమాత్రం ఏం ప్రయోజనం.

గురువులు ప్రాణాలకు ఆశ వదులుకున్నాడు. ప్రియురాలి చేతిలో చనిపోవటం కూడా ఒక అదృష్టమేనని మనసు సరిపెట్టుకుని ముందడుగువేసి ఆమెను బలంగా కౌగలించుకున్నాడు. జీవితంలో మళ్ళీ తనకు దొరకని ఆమెత్తని స్పర్శ వెచ్చగా, హాయిగా, ఏదోలా యెప్పటికీ వదులుకోవాలనిపించకుండా వుంది. ఆ కౌగిలికోసం మళ్ళీ బ్రతుకుమీద ఆశ పుడుతోంది. ఆ కౌగిలిని తగినంత కాలం అనుభవించని జీవితానికి అర్థంలేదనిపిస్తోంది. అయితే అది మృత్యుకౌగిలి అని అతనికి తెలుసు.

ఈశ్వరికి కూడా ఆ కౌగిలి ఎంతో సుఖంగా వుంది. ఆమె చేతులు తడబడిపోతున్నాయి. గురువులు వీపులో పొడవగల శక్తి తనకున్నదని ఆమెకు అనిపించడంలేదు.

"నేను మూడు అంకెలు లెక్కపెట్టేలోగా చెప్పిన పని చేస్తే ఈశ్వరి బ్రతుకుతుంది. లేదా యిద్దరి గుండెల్లోనూ ఒకేసారి తూటాలు దిగుతాయి" అన్నాడు బాస్.

గురువులు, ఈశ్వరి ఊపిరి బిగబట్టారు. ఇద్దరూ ఒకే సారి చస్తే అంతకంటే కావల్సినదేముందని ఇద్దరూ అనుకున్నారు.

బాస్ అంకెలు మొదలుపెట్టాడు "రెడీ వన్, టూ... త్రీ."

ఈశ్వరి చేతిలోని కత్తి నేలమీదకు జారవిడిచింది. అయితే అదే సమయంలో తుపాకులు మ్రోగిన చప్పుడయింది. అక్కడ కాదు. కాస్త దూరంగా....

ప్రాణంపోతోందో లేదో తెలియనిస్థితిలో గురువులు, ఈశ్వరి స్పృహతప్పి క్రింద పడిపోయారు.

* * *

"శ్రీకృష్ణపరమాత్మ ప్రయివేట్ డిటెక్టివ్ అనే దురభిప్రాయంతో నేతనన్ని సాయంకోరాను. మేం ముందుగా అనుకున్నట్లుగానే అపూర్వనిధి అనే అతనికీ చెప్పాను. అంతే___ నేనూ, నా కొడుకు కూడా అతనికి బందీలయ్యాం.

మా అదృష్టవశాత్తూ కొద్దిరోజుల క్రితం ఎలాగో తప్పించుకుని బయటపడి రామేశం దగ్గరకు చేరాం.

అక్కడ పరిస్థితులన్నీ తెలిశాయి. రామేశానికి శ్రీకృష్ణ పరమాత్మ అసలు స్వరూపం చెప్పేశాను. ఆయన చాలా కంగారుపడ్డాడు. ఈలోగా రామేశం మనవడు రాముం ఆటవిక ప్రాంతం నుంచి సురక్షితంగా అక్కడికి చేరుకుని గురువులు సహకారంతో అపూర్వనిధి చేరుకున్నట్లు చెప్పాడు. గురువులు సాధించిన విజయం వింటూంటే అతను అపూర్వనిధిని జయించగలడనిపించింది.

పోలీసుల సాయంతో నిధివద్దకు బయల్దేరాం. మొదటి

ప్రయత్నంలో కొన్ని ప్రాణాలు నష్టమైపోయాయి. అయినా పట్టువిడవకుండా మరో ప్రయత్నం చేసి ఇక్కడకు రాగలిగాం. దూరాన్నుంచి యిక్కడి పరిస్థితి చూశాం. వేరే గత్యంతరం కనబడలేదు. పోలీసులు తమ వద్దనున్న స్పృహతప్పించే బాంబులు విసిరారు. గుండాగులందరూ లొంగిపోయారు" అన్నాడు శంకూర్.

"శ్రీకృష్ణపరమాత్మ మంచివాడనుకోలేదు కానీ చివర్లో నాకూడా అపకారం తలపెడతాడని ఊహించలేక పోయాను. ఇక్కడున్న అపూర్వనిధి నాయకుడికీ పరమాత్మకూ స్నేహముందని ముందుగా ఏమాత్రం ఊహించగలిగినా చాలా జాగ్రత్తపడి వుండేవాడిని. కానీ నేను నేరస్థుణ్ని. నా మనస్తత్వం నేరాలకు ప్రోత్సహించేది. అందుకని నేను శిక్షలు అనుభవించక తప్పదనుకుంటూను. నాలాంటి దుర్మార్గుణ్ని ప్రేమించినందుకు ఈశ్వరి కూడా అవస్థలు పడాల్సివచ్చింది" అన్నాడు గురవులు.

"గురవులూ! నువ్వు దేశానికి మహోపకారం చేశావు. నీ కారణంగా ఈ దేశపు మర్యాద నిలిచిందన్నా ఆశ్చర్యం లేదు. నువ్వు చేసిన తప్పులన్నింటినీ దేశం తప్పక క్షమిస్తుంది. నువ్వు మామూలు జీవితం గడపడానికి అవకాశముంది. నీ గతజీవితం యెలాంటిదైనప్పటికీ నువ్వు చేసిన ఒక్క మంచిపనితో ఆ తప్పులన్నీ క్షాళనమైపోయాయి. కానీ ఇకమీదట పవిత్రమైన జీవితం గడపడానికి ప్రయత్నించు" అన్నాడు అక్కడున్న పోలీస్ అధికారి.

"గురవులులాంటి నరహంతకుణ్ని అర్థంచేసుకోగలిగిన మీరు నన్నుమాత్రం యెందుకు అర్థంచేసుకోరు? జైల్లో మగ్గి చావవలసిన గురవులును నేనక్కణ్నించి తప్పిం

చాను. నా కారణంగానే గురువులు ఘనవిజయం సాధించి ఈ అంతర్జాతీయ గూఢచారి శాఖ రహస్యాన్ని బయట పెట్టగలిగాడు. అందుకు ప్రభుత్వం నన్నూ అభినందించ వలసివున్నది" అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

"నువ్వు చివర్లో యిక్కడి మనుషులతో చేతులు కలప కుండా ఉండివుంటే తప్పకుండా నిన్నభినందించి ఉండే వాళ్ళం. అయినా యిప్పుడు మాత్రం నీకేం తక్కువ చేయడంలేదు. నిన్ను నీ జన్మస్థానానికే పంపబోతున్నాము. అదెంత గౌరవం!" అన్నాడు పోలీస్ అధికారి.

రామేశం, ఠాకూర్ నవ్వారు.

గురువులు మాత్రం "ఈ లోకంలో నా అంతో అమా నుషమని అనుకుంటూండేవాడిని. కానీ గంగాపురం, ఆట విక ప్రాంతంలో నేను పొందిన అనుభవాలు, యిక్కడ అపూర్వనిధి మనుషుల సరదాలు చూశాక ఈ ప్రపంచంలో ఎంత అమానుషం నిండివుందో గ్రహించాను. నా ద్వారా తన పనులన్నీ పూర్తి చేయించుకుని ఆఖరున నేను బాధలు పడుతూంటే చూస్తూ వినోదించిన ఈ శ్రీకృష్ణపరమాత్మ ప్రవర్తన అన్నిటికంటే అమానుషం అనిపించింది. ఇప్పుడు నామీద నాకుగల గౌరవం పెరిగింది" అన్నాడు.

"అందులో న్యాయం వుంది" అన్నాడు రామేశం. "అయితే ప్రతిమనిషిలోనూ అజ్ఞాతంగా అమానుషత్వం దాగివుంటుంది. అందుకు సాక్ష్యం నేనే! ఒకప్పుడిక్కడి బాస్ నన్నెంతగానో హింసించి వినోదించాడు. పగవాళ్ళ క్కూడా అటువంటి హింసలు వద్దని అప్పట్లో నేను అను కున్నాను. కానీ యిప్పుడలా అనిపించడంలేదు. ఇతరుల నెలాంటి బాధ పెట్టాడో, అలాంటి బాధలు బాస్ పడుతూంటే చూసి వినోదించాలని ఉంది నాకు. అది

అమానుషమే కావచ్చు. నాలో యిప్పుడా కోరిక వుంది—"

"నాలోనూ ఉంది" అన్నాడు ఠాకూర్.

"నాలోనూ ఉంది" అన్నాడు గురువులు.

"నాలోనూ ఉంది" అంది ఈశ్వరి.

"మీ మాటలు వింటూంటే నాకూ అటువంటి కోరిక కలుగుతోంది" అన్నాడు అక్కడున్న పోలీస్ అధికారి.

వారందరి కోరికలు వింటూంటే అపూర్వనిధి బాస్ ముఖంలో బెదురు కనబడింది. శ్రీకృష్ణపరమాత్మలో కంగారు కనబడింది.

"మొత్తం మూడు రౌండ్స్" అన్నాడు ఠాకూర్.

"మొదటిరౌండ్ ఆట నేను తయారుచేస్తాను" అన్నాడు రామేశం. రెండవ రౌండు ఠాకూర్ తయారు చేస్తానన్నాడు. మూడవరౌండు గురువులు, ఈశ్వరి చేస్తానన్నారు.

రామేశం తన ఆట చెప్పాడు.

బాస్, శ్రీకృష్ణపరమాత్మ ముఖాల్లో నెత్తురు చుక్క లేదు.

—: సమాప్తం :—